క్లుప్తంగా

ఎమ్మెల్యే అనిల్‌తో ఎంపీపీ మేకల



అమరావతి: నర్సరావుపేట పార్లమెంటు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎమ్మెల్యే అనీల్ కుమార్ యాదవ్‌ను నర్సరావుపేటలోని పార్టీ కార్యాలయంలో ఎంపీపీ మేకల హనుమంతరావు శనివారం మర్యాదాపూర్వకంగా కలిశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థిగా బీసీలకు అవకాశం కల్పించి.. వైఎస్సార్ సీపీ బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు తెలుగు సినిమా పాటల పోటీలు

సత్తెనపల్లి: చైతన్య కళా స్రవంతి 45వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని గుంటూరు రోడ్డులో ఉన్న శ్రీ సరస్వతీ శిశు మందిరం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి జాతీయ స్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు నిర్వహించనున్నట్లు చైతన్య కళా స్రవంతి అధ్యక్షుడు, లయన్ కమతం శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ప్రథమ బహుమతి రూ. 5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ. 2 వేలు, ప్రత్యేక బహుమతులుగా రూ. 500 చొప్పున ఐదుగురికి నగదు అందించటం జరుగుతుందన్నారు. చైతన్య కళా స్రవంతి -2024 వ విశిష్ట సేవా పురస్కారాలు కేవీవీ కోటేశ్వరరావు, కొంగర కృష్ణ , వల్లపాటి సుశీల, షేక్ కరీముల్లా, లయన్ మంచి కంటి వేంకటేశ్వరరావు, కోట సరోజినిలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు చైతన్య కళా స్రవంతి కార్యదర్శి గుండవరపు అమర్ నాథ్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): అనారోగ్య సమస్యల కారణంగా వివాహిత పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో శనివారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన సూరిపోగు నిర్మల(45) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆరోగ్య సమస్యను తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు ఆమెను తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున నిర్మల మృతి చెందింది. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెల్దుర్తి: వేగంగా వెళ్తున్న ఆటో బోల్తా కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గుండ్లపాడు, కండ్లకుంట గ్రామాల మధ్య శనివారం జరిగింది. గుండ్లపాడు గ్రామానికి చెందిన కంభంపాటి చిన ఏసోబు (45) గేదెల వ్యాపారం నిమిత్తం కండ్లకుంట గ్రామానికి వెళ్లి స్వగ్రామానికి ఆటో ఎక్కి తిరిగి వస్తుండగా ఆటో బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చిన ఏసోబుకు భార్య, పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు తెలిపారు.

నేటి నుంచి నరసింహ స్వామి కల్యాణోత్సవాలు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి 68వ కల్యాణ మహోత్సవాలను నేటి నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. నేడు స్వామివారి ఫౌంజు సేవ, సోమవారం కల్యాణం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు కల్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఈ నెల 20 నుంచి జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ రైతు సంఘ కమిటీ సభ్యులు వెల్లడించారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన



పిడుగురాళ్ల: మత్తు పదార్థాలను నిర్మూలించి ఉత్తమ సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిడుగురాళ్ల అంజువున్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మెస్త్రీ అన్నారు. పట్టణంలోని చెరువుకట్ట బజార్‌లోని వాటర్ ట్యాంక్ సమీపంలోని వాకింగ్ ట్రాక్ వద్ద శనివారం మత్తు పదార్థాల నిర్మూలనపై జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం.. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం' అనే జాగృతి ఉద్యమాన్ని ఈ నెల 8 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోగ్రాం కన్వీనర్ షేక్ జానీ, హాఫీజ్ మహబూబ్ రహమాన్, ఎండీ లతీఫ్, సయ్యద్ మీరా పాల్గొన్నారు.

సేవలకు ప్రోత్సాహం

- అవార్డులతో వలంటీర్లను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- నగదు ప్రోత్సాహం భారీగా పెంపు
- సత్తెనపల్లి డివిజన్‌లో వలంటీర్ వ్యవస్థ పై సర్వత్రా హర్షం
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరవేత

గ్రామ స్వరాజ్య స్థాపన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ అత్యున్నత సేవలతో ప్రజల మన్ననలు పొందుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సంక్షేమ వారధులుగా సేవలిందిస్తూ ఐదో ఏడాదిలోకి వలంటీర్లు అడుగు పెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఆగస్టు 15న వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని ఒక పట్టణం, 9 మండలాల పరిధిలో 2,828 మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందిస్తూ.. పురస్కారాలు అందుకున్నారు. -సత్తెనపల్లి

ప్రోత్సాహక నగదు పెంపు..

తమ పరిధిలో ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్లను ఎంపిక చేసి, వారిని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఏటా వారికి సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్రా వంటి పురస్కారాలు అందిస్తోంది. వలంటీర్ల సేవలకు గుర్తుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి అందించే ప్రోత్సాహక నగదును భారీగా పెంచడంతో వలంటీర్లంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సేవా వజ్రకు రూ. 30 వేల నుంచి రూ.45 వేలకు, సేవా రత్నకు రూ.20 వేల నుంచి రూ.30 వేలకు, సేవా మిత్ర కు రూ.10వేల నుంచి 15 వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు.

పారదర్శకంగా ఎంపిక...

వలంటీర్లకు ఇచ్చే పురస్కారాల ఎంపిక పారదర్శకంగా జరిగింది. ఎక్కడా ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా సాంకేతికంగానే రాష్ట్ర స్థాయిలో టెక్నికల్ పద్ధతిలో ఎంపిక చేశారు. వలంటీర్ల పనితీరు ఆధారంగా నిర్దిష్ట సమయంలో ప్రజలకు చేసే సేవలను గుర్తించి పురస్కారాలకు అర్హులుగా నిర్ణయించారు.



పొడపాడులో పింఛను ఇస్తున్న వలంటీర్ వి.చిన్నబాబు



సత్తెనపల్లి పట్టణంలో వృద్ధురాలికి బయోమెట్రిక్ వేస్తున్న వలంటీర్ ఉమామహేశ్వరి

వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం మూడు రకాల అవార్డులను అందిస్తోంది. 95-100 శాతం పనితీరు కనబరిచిన వారికి సేవా వజ్ర, 80-95 శాతం సాధించిన వారికి సేవారత్న, 60 శాతం పైగా సాధించిన వారికి సేవా మిత్ర అవార్డులను అందజేస్తున్నారు.

సత్తెనపల్లి డివిజన్‌లో మండలాల వారీగా వలంటీర్ల అవార్డులు ఇలా..

మండలం	సేవా మిత్ర	సేవా రత్న	సేవా వజ్ర	మొత్తం వలంటీర్లు
సత్తెనపల్లిటౌన్	284	05	02	291
సత్తెనపల్లి రూరల్	288	05	-	393
ముప్పాళ్ళ	196	05	02	203
రాజుపాలెం	237	05	-	242
నకరికల్లు	319	05	01	325
మొత్తం	1,424	25	05	1,454
పెదకూరపాడు నియోజకవర్గంలో..				
పెదకూరపాడు	255	05	-	260
అచ్చంపేట	315	05	02	322
అమరావతి	330	05	02	337
బెల్లంకొండ	149	05	01	155
క్రోసూరు	295	05	-	300
మొత్తం	1,344	25	05	1,374

వలంటీర్ వ్యవస్థతో ఏం మార్పు వచ్చింది..?

- గత ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఆయా కేటగిరీకి చెందిన లబ్ధిదారులు పింఛన్ సొమ్ము తీసుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది.
- వలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీనే తెల్లవారకముందే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. ఆసుపత్రుల్లో, ఇతర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్న వారికి కూడా కొందరు వలంటీర్లు అక్కడకు వెళ్లి పింఛను నగదు అందజేస్తున్నారు.
- ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం లబ్ధిని కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుని ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుంది.
- ప్రభుత్వమే వలంటీర్ల ద్వారా ప్రజల ఇంటి వద్దకు వచ్చి.. సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం చరిత్రలో ఇదే మొదటిసారి కావొచ్చు.

బాధ్యతగా భావించి సేవలు



వలంటీర్ బాధ్యత ద్వారా ప్రభుత్వం మాకు ఎంతో గుర్తింపునిచ్చింది. ఏటా మాకు అవార్డులు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. వలంటీర్ సేవలను బాధ్యతగా భావిస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు మమ్మల్ని అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారు. సేవ వజ్ర అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉంది.

– చింతల.ఉమామహేశ్వరి, సేవ వజ్ర, సత్తెనపల్లి.

సామాజిక దృక్పథంతో సేవలు



వలంటీర్‌గా సామాజిక దృక్పథంతో పనిచేస్తున్నాం. నాకు సేవ వజ్రా పురస్కారం రావడంతో బాధ్యత మరింత పెరిగింది. గౌరవ వేతనం కోసమే.. కాకుండా ప్రజలకు సేవ చేయాలన్న భావతో వలంటీర్‌గా పనిచేస్తున్నాం. వలంటీర్లు మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు ఈ అవార్డు దోహదపడుతుంది.

– అమ్మిశెట్టి సుజాత లక్ష్మి, సేవా వజ్ర, సత్తెనపల్లి.

కరోనా సమయంలో కాపాడారు



నాకు కరోనా వచ్చిన సమయంలో మా కుటుంబ సభ్యులు పట్టించుకోలేదు. మా ప్రాంతం మొత్తం లాక్‌డౌన్ అన్నారు. మా నాన్నకు కరోనా వచ్చింది. ఆ సమయంలో మా వలంటీర్ వెలితోటి చిన్నబాబు ఇంటికి వచ్చి అవసరమైన మందులు, పౌష్టికాహారం అందించారు. మాకు కరోనా పూర్తిగా తగ్గే వరకు అండగా నిలిచారు.

–దాసరి కర్మేలు, పొడపాడు, పెదకూరపాడు మండలం.

ప్రతి పథకం వర్తించేలా..



ప్రభుత్వ పథకాలు, రాయితీలకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని వలంటీర్ ఎప్పటికప్పుడు మా కుటుంబానికి వివరిస్తున్నారు. వాటి ద్వారా లబ్ధిచేకూరుస్తున్నారు. నాకు పింఛను వస్తుంది. వైఎస్సార్ చేయూత మా కొడలికి అందుతోంది. పిల్లలకు అమ్మ ఒడి నగదు వస్తోంది. మా పెద్ద కొడుకు జోజప్ప మృతి చెందితే వైఎస్సార్ బీమా రూ.లక్ష వచ్చింది.

– తేరజమ్మ, పొడపాడు, పెదకూరపాడు మండలం.

కేజీబీవీ విద్యార్థినుల ర్యాలీ



క్రోసూరు: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణకుమారి పాల్గొని, బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న సాంఘిక దురాచారాలు, సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. బాల్య వివాహాలను తల్లిదండ్రులు ప్రోత్సహించటం నేరమన్నారు. అటువంటి చర్యలకు పాల్పడినట్లు తెలిస్తే అందుబాటులో ఉన్న ప్రభుత్వ అధికారికి తెలియజేయవచ్చన్నారు. 100 నంబరుకు ఫోను చేసి చెప్పవచ్చన్నారు. పోక్సో చట్టం గురించి, పరిశుభ్రత గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదువుకోవాలని కోరారు. అనంతరం బాలికలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.మాధవి, రహిమున్నీసా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పెద నెమలిపురిలో జ్వర పరీక్షలు



తొట్టిలోని నీటిని తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాజుపాలెం: పెదనెమలిపురి ఎస్సీ కాలనీలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వర పరీక్షలు నిర్వహించారు. మురుగు కాలువల్లో ఎబెట్ పిచికారీ చేసి, సున్నం, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. వైద్య శిబిరంలో 42 మందికి డాక్టర్ కృష్ణకుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు సిబ్బందితో ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నివాసితులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తేజస్విని, ఏఎన్‌ఎం నాగమణి, ఆశ కార్యకర్తలు కుమారి సీతారావమ్మ పాల్గొన్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

నకరికల్లు: ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని నరసరావుపేట ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వార్షిక తనిఖీలు చేపట్టారు. రికార్డులు, మౌలిక వసతులు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేవిధంగా కృషిచేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, గంట సమయం అదనంగా బోధించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. భోజనం, బంగారుతల్లి పథకం అమలు, రక్తహీనత గలవారికి ఐరన్‌మాత్రలు ఇస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బీఏవీఎల్ వరప్రసాదరావు, బి.వెంకటేశ్వర్లు, బి.ఎం.సుభాని, ఎ.వెంకటేశ్వరరావు, వెంకటజోవులు, ప్యానల్ సభ్యులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న వేణుగోపాలరావు

20న ఫీరోజీ రుషీంద్రుల 135వ వార్షికారాధన

సత్తెనపల్లి: పట్టణంలోని క్రిస్టియన్ పేట సమీపంలో ఫీరోజీ రుషీంద్రుల మందిరాన్ని ఏర్పాటు చేశారు. గత 134 సంవత్సరాలుగా పట్టణ ప్రజలు రుషీంద్రుల వార్షికారాధనను వైభవంగా నిర్వహిస్తూ 135వ ఆరాధన ఉత్సవాన్ని ఈ నెల 20 నుంచి నిర్వహించ నున్నారు. గుంటూరు జిల్లాలో అనేక చోట్ల ఆలయ నిర్మాణాలు జరిగాయి. ఆయన ప్రధాన పీఠం సత్తెనపల్లి లోని సమాధిపై నెలకొల్పారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని పీఠాన్ని దర్శిస్తుంటారు. ఫీరోజీ రుషీంద్రుల 135వ వార్షికారాధన సందర్భంగా ఈ నెల 20, 21న పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి పులహరి భాను ప్రసాద్ తెలిపారు. రథోత్సవం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్య క్రమాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.



రుషీంద్రుల మందిరం

బాల్య వివాహం సాంఘిక దురాచారం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి
- నాదెండ్లలో బేటీ బచావో - బేటీ పడావో

నాదెండ్ల: బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల సీడీపీవో కార్యాలయంలో శనివారం బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో శాంతకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ, ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతుండటం శోచనీయమన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలను వివాహం చేసుకునే వరునికి 10 ఏళ్ల జైలు శిక్ష, అలాంటి వివాహాలు చేసే వారిపై, ప్రోత్సహించే వారిపై, వివాహాలకు హాజరయ్యే వారిపై సైతం చట్ట ప్రకారం కేసులు నమోదు తప్పవన్నారు.
దేశజనాభాలో లింగ నిష్పత్తి వ్యత్యాసం తీవ్రంగా ఉందని, భ్రూణహత్యల కారణంగా ప్రస్తుత జనాభాలో స్త్రీల సంఖ్య పురుషులకన్నా తక్కువగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం బాలికల సంక్షేమం, విద్య కోసం బేటీ బచావో-బేటీ పడావో పథకం ప్రవేశపెట్టిందన్నారు. 2015లో హర్యానాలోని పానిపట్‌లో వంద కోట్ల నిధుల కేటాయింపుతో పథకం ప్రారంభమైందన్నారు. ఈ పథకం పొందేందుకు పదేళ్ళ కన్నా తక్కువ వయస్సు గల ఆడపిల్లలు అర్హులన్నారు. సమీప బ్యాంకు, పోస్టాఫీసుల్లో సంప్రదించి పథకంలో నమోదు చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, తహశీల్దార్ డీవీబీ వరకుమార్, నాదెండ్ల, గణపవరం సొసైటీల చైర్మన్లు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వరి, ఎంఈవో కృష్ణారెడ్డి, ఏసీడీపీవో నిర్మలారాణి, సూపర్‌వైజర్లు నిర్మలాకృష్ణ మాల, పద్మ, ఉష, విజయకుమారి, ఎంఎస్‌కేలు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కమిషన్ సభ్యులు పద్మావతి

రామాలయంలో చోరీ

రొంపిచర్ల : మండలంలో సుబ్బయ్యపాలెం గ్రామంలో గల కోదండరామస్వామి ఆలయంలో చోరీ జరిగిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగి ఉండవచ్చునని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో గల శ్రీ కోదండరామస్వామి ఆలయంలోకి వెళ్ళిన గ్రామస్తులకు హుండీ కనబడకపోవటంతో చోరీ జరిగిందని గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు గుడిలో ఉన్న హుండీని తీసుకెళ్లిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారము తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని కల్పించాలి

డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్

బొల్లాపల్లి: వంద రోజుల పనిదినాలు ప్రతి ఒక్క ఒక్కరికీ కల్పించాలని డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 15వ విడత సోషల్ ఆడిట్ ప్రజావేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రజావేదికలో సామాజిక తనిఖీ వివరాలు వెల్లడించారు. పీడీ మాట్లాడుతూ మండలంలో 11 వేలు జాబ్ కార్డులున్నాయని, వీరిలో 609 జాబ్ కార్డులకు మాత్రమే వంద రోజులు పనిదినాలు పూర్తి చేశారని వివరించారు. సామాజిక తనిఖీలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరి పని కల్పించాలని నివేదిక వెల్లడైందని తెలియజేశారు, పేదల మండలంలో వలసల నివారణకు పనులు కల్పించాలని సూచించారు. క్షేత్ర సహాయకులు సచివాయల కేంద్రాల్లో హాజరు కావాలని, వారంలో ఒక రోజు ప్రతి శుక్ర వారం కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో తగిన పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. సామాజిక తనిఖీల్లో 23 పంచాయతీల్లో 509 పనుల్లో రూ 8.99 కోట్ల మేర పనులు జరిగాయని తెలిపారు.
ఈ ప్రజావేదికలో రూ.16 లక్షలకు ఉద్యాన పంటలకు నాటిన మొక్కలు కనిపించలేదని, ఆయా పొలంలో పత్తి, మిరప, పొగాకు వంటి పంటలు సాగు చేసినట్లు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణకు పీడీ ఆదేశించారు. తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉపాధిహామీ పథకం పనుల కొలతల్లో తేడాలకు గాను రూ.50 వేలు మస్టర్ షీట్స్‌లో రూ.20 వేలు తేడాలు గుర్తించి మొత్తం రూ.70 వేలు రికవరీ చేయాలని పీడీ వెల్లడించారు. ప్రజావేదికలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మీ, ఏపీడీ ఈ బూసిరెడ్డి, అంబుడ్స్‌మెన్ అధికారి ఎస్‌కె మీరావలి, ఈఓపీఆర్డీ ఎస్‌కె జిలానీ బాషా, ఎస్సార్పీ టీ వెంకటేశ్వరరావు, ఏపీవో జి.ఎస్.అంజనేయరాజు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవాలు

ముప్పాళ్ళ: ముప్పాళ్ళ, దమ్మాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఎంఈఓ ఒంగోలు రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, అచ్చంపేట ఎంఈఓ రావిపాటి నరసింహారావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పాతూరి కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు మిరియమ్మ(దమ్మాలపాడు), నాగేంద్రమ్మ(ముప్పాళ్ళ), వి.రమేష్(నార్నెపాడు) తదితరులు పాల్గొన్నారు.



దమ్మాలపాడు పాఠశాలలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్

విజయపురిసౌత్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని తెలంగాణ రాష్ట్ర దీక్ష గురువు భోజు మహరాజ్ అన్నారు. శనివారం విజయపురి సౌత్ లోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో జరిగిన సేవలాల్ 285వ జయంతి ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంజారాల హక్కుల కోసం 18వ శతాబ్దంలో సాగిన పోరాటంలో సంత్ సేవాలాల్ కీలక భూమిక పోషించారని చెప్పారు. మానవాళికి ధర్మమార్గాన్ని అలవాటు చేసేందుకు సంత్ సేవాలాల్ మహారాజ్ విశేష కృషి చేశారని తెలిపారు. సేవలాల్ బోధనలతో బంజారాలు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోగలిగారని చెప్పారు. అనంతరం ఆలయ ధర్మకర్త కె.పాండు నాయక్ ఆధ్వర్యంలో భోజు మహరాజ్‌ను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడకు చెందిన అపోలో రిచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో ఎత్తిపోతల ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినిలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజ్యోత్ హనుమంత్ నాయక్, హైదరాబాద్ సేవాలాల్ మహరాజ్ పీఠాధిపతి లచ్చు సాధ, అర్చకుడు సభవత్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర దీక్ష గురువు భోజు మహారాజ్

కారు ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు

నాదెండ్ల: బైక్‌ను కారు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు గాయపడిన సంఘటన జాతీయ రహదారి గణపవరం ప్రసన్నవంశీ స్పిన్నింగ్‌మిల్లు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం, మైదవోలుకు చెందిన నక్కా శ్రీనివాసరావు ఓ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తుంటాడు. తన ద్విచక్రవాహనంతో చిలకలూరిపేట వెళ్తుండగా, ప్రసన్నవంశీ స్పిన్నింగ్ మిల్లు వద్దకు రాగానే యూటర్న్ తీసుకుంటుండగా, చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో ఉపాధ్యాయుడికి గాయాలయ్యాయి.

12వ పీఆర్సీ మధ్యంతర భృతిని తక్షణమే చెల్లించాలి

సత్తెనపల్లి: ప్రభుత్వం 12వ పీఆర్సీ మధ్యంతర భృతిని తక్షణమే 30 శాతం చెల్లించాలని ఏపీ జేఏసీ చైర్మన్ పెండెం మణిరావు డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న కొత్త డీఏలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ఏపీ సీపీఎస్ పిలుపు మేరకు సత్తెనపల్లి ఏపీ సీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మణిరావు మాట్లాడుతూ సీపీఎస్ ను రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జీపీఎస్, ఏపీజీఎల్ఐ లోన్లను వెంటనే మంజూరు చేయాలని, సరెండర్ లీవ్‌లను ఎన్‌క్యాష్‌మెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, ఎస్టీయూ రెహమాన్, ఎం. అప్పారావు, పి.వేణు, ఏపీటీఎఫ్ శివారెడ్డి, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిలక అగస్టస్ బాబు తదితరులు పాల్గొన్నారు.